'పది' మూల్యాంకనం 98శాతం పూర్తి

జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాకు కేటాయించిన పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం 98 శాతం పూర్తి అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం తెలియజేశారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పది మూల్యాంకనానికి సంబంధించి జిల్లాకు 2,09,928 పదవ తరగతి జవాబు పత్రాలు కేటాయించగా మంగళవారం నాటికి 2,07,614 జవాబు పత్రాలను దిద్దే కార్యక్రమం పూర్తి అయ్యిందన్నారు. తెలుగు, హిందీ సైన్సు, సోషల్ సబ్జెక్టుల మూల్యాంకనం పూర్తి అయ్యిందన్నారు. సాంస్కృతం, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి 2,314 పేపర్లు మూల్యాంకనం చేయాల్సి ఉందన్నారు. వాటిని కూడా రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించిన గడువు లోపు పూర్తి చేస్తామని తెలిపారు.

మాట నిలుపుకోని మనవడు..!

◆ బిటిపి ఎత్తిపోతలకు 60 రోజుల్లో భూసేకరణ హామీ
◆ నాలుగేళ్లు అయినా కదలిక శూన్యం ◆ పేరూరు ఎత్తిపోతల భూసేకరణ అంతే
◆ అటకెక్కిన ఆంజినేయస్వామి ప్రాజెక్టు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ జిల్లా మనువడు అయిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలుపుకోలేదు. జిల్లాకు ముఖ్యమంత్రి హోదాలో వివిధ సందర్భాల్లో విచ్చేసిన సమయంలో ముఖ్యమైన హామీలు కొన్నింటిని ఆయన ఇచ్చారు. అయితే ఆ హామీలు ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. వీటి సంగతి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. ప్రధానంగా సాగునీటికి సంబంధించి రెండు హామీలిచ్చారు. అవి ఒక్క అడుగూ ముందుకు పడకపోవడం గమనార్హం.

60 రోజుల్లో భూసేకరణ పూర్తి అని హామీ...

2021 జులై 8వ తేదీన జిల్లాలోని రాయదుర్గం మండలంలో జరిగిన రైతు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు జగన్మోహన్‌రెడ్డి విచ్చేశారు. ఈ సమయంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి కళ్యాణదుర్గం, రాయదుర్గంకు హంద్రీనీవా నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీటిని అందించే పనులను చేపడతామని హామీనిచ్చారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ 1400 ఎకరాలను 60 రోజుల్లోపు పూర్తి చేస్తామని చెప్పడమే కాకుండా యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. స్వయంగా తానే పర్యవేక్షిస్తానని చెప్పారు. ఉంతకల్లు వద్ద చేపడుతున్న ఆంజినేయ స్వామి ప్రాజెక్టును చేపడతామని హామీనిచ్చారు. హంద్రీనీవా కింద 36వ ప్యాకేజీని పూర్తి చేస్తామని హామీనిచ్చారు. అయితే వీటిల్లో ఏ ఒక్కటీ ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. కనీసం భూసేకరణ కూడా పూర్తవలేదు.

అమలుకు నోచని పేరూరు ఎత్తిపోతల హామీ

జీడిపల్లి నుంచి దేవరకొండ, తోపుదుర్తి, ముట్టాల రిజర్వాయరుతోపాటు పేరూరు ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేస్తామని 2022 జులై 14వ తేదీన సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో జరిగిన పంటలబీమా పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి హామీనిచ్చారు. పేరూరు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వెంటనే పూర్తి చేస్తామని హామీనిచ్చారు. రెండు సంవత్సరాల కాలంలోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని హామీని ఇచ్చారు. అయితే ఈ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. భూసేకరణ పనులు ముందుకు సాగలేదు.

ఆరు వేల క్యూసెక్కులకు హంద్రీనీవా పెంచుతామన్నారు...

'ఇప్పుడున్న హంద్రీనీవా కాలువలో 2200 క్యూసెక్కులు మాత్రమే నీరు ప్రవహిస్తోంది. దీన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతాం. దీనితోపాటు అదనంగా ఈ కాలువకు సమాంతరంగా మరో కాలువను నిర్మిస్తాం'. అని 2019వ సంవత్సరం అక్టోబరు 10వ తేదీన అనంతపురం నగరంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న సమయంలో మాటనిచ్చారు. ఈ జిల్లాకు మనువడిని.. ఈ జిల్లా పరిస్థితుల పట్ల తనకు స్పష్టమైన అవగాహనుంది అని కూడా చెప్పారు. కానీ ఆచరణలో ఆ పనులు ముందుకు సాగలేదు.

మూడు పర్యటనలు.. మూడు హామీలు..

ముఖ్యమంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు సార్లు పర్యటించారు. ఈ సమయాల్లో జిల్లాకు సంబందించిన ప్రధానమైన మూడు హామీల్లో ఒక్కటీ పూర్తవలేదు. సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి జిల్లాలో రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. అయితే ఈ మూడు సంవత్సరాల్లో ప్రకృతి సహకారంతో మంచి వర్షాలు పడటంతో నీటి సమస్య ఉత్పన్నమవలేదు. వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేదన్న అభిప్రాయం రైతు సంఘాల నుంచి వ్యక్తమవుతోంది. జిల్లాకు ప్రధాన సాగునీటి వనరైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ దయనీయ స్థితికి చేరింది. ఏ సమయంలో ఎక్కడ గండిపడుతుందోనన్న ఆందోళన జలవనరుల శాఖ అధికారుల్లో సైతముంది. యుద్ధ ప్రాతిపదికన ఈ కాలువ ఆధునీకరణ చేపట్టాల్సి ఉంది. అయితే ఈ పనులను గడిచిన నాలుగేళ్లుగా నిధుల కేటాయింపుల్లేవు. దీంతో రెండేళ్లుగా అధికంగా నీటిని తీసుకునే అవకాశమున్నా కాలువలు పటిష్టంగా లేకపోవడంతో తక్కువ నీటినే తుంగభద్ర డ్యామ్ నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దుర్భిక్ష ప్రాంతంగానున్న అనంతపురం జిల్లా సాగునీటి రంగానికి ప్రాధాన్యత కల్పించాలని జిల్లా రైతాంగం వేడుకుంటున్నారు. ఈ రకంగా నిధులు కేటాయించి జిల్లా మనువడిగా సహకారం అందిస్తారని ఆశిస్తున్నారు.

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిహెచ్.బాబురావు

ప్రజా వ్యతిరేక బిజెపిని

గద్దెదించుతాం

బహిరంగ సభకు హాజరైన ప్రజలు

◆ ఎపిలో వైసిపి,టిడిపి రెండూ బిజెపికి సాగిలపడుతున్నాయి..
◆ సిపిఎం, సిపిఐ ప్రచారభేరిలో బాబురావు, రామకృష్ణ
◆ 'అనంత'లో బహిరంగ సభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆర్థిక విధానాలు, మతతత్వ విధానాలతో దేశానికి నష్టదాయకంగా మారిన బిజెపిని కేంద్రంలో గద్దెదింపాల్సిందేనని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐలు ఈనెల 14వ తేదీ నుంచి చేపట్టిన ప్రచారభేరి కార్యరకమంలో భాగంగా మంగళవారం సాయంత్రం అనంతపురం నగరంలోని పాతూరు బ్రహ్మంగారి గుడి సమీపంలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు రామిరెడ్డి, శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబురావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారంలో తొమ్మిదేళ్ల కాలంలో దేశాన్ని అన్ని విధాలుగా అధోగతి పాలుజేస్తోందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్‌లకు దోచిపెడుతూ ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. బిజెపి అధికారంలో రాకముందు వరకు దేశం అప్పు 47 లక్షల కోట్లు మాత్రమే ఉండేదని తెలిపారు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో దేశం అప్పు రూ.150 లక్షల కోట్లకు చేరిందన్నారు. 70 ఏళ్లలో లేనంత అప్పు ఈ కాలంలో పెరిగిందని పేర్కొన్నారు. దేశ సంపద మొత్తం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. పేదలపై మాత్రం భారాలు మోపుతూపోతోందన్నారు. మరోవైపు మతత్వ విధానాలను అమలు చేస్తూ ప్రజల మధ్య చీలక తీసుకొస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి ఇటీవల హైదరాబాద్ వచ్చిన సమయంలో ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇది ఒక్క ముస్లిం రిజర్వేషన్ తొలగింపుతోనే ఆగదని, బీసీ, ఎస్సీ,ఎస్టీల రిజర్వేషన్లను కూడా క్రమంగా తొలగించాలన్నది బిజెపి లక్ష్యమని విమర్శించారు. మరోమారు అధికారంలోకి వస్తే ఇప్పుడు రాజ్యాంగాన్ని సైతం మార్చివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మరోమారు బిజెపిని అధికారంలోకి రానివ్వకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనూ వైసిపి పాలన అధ్వానంగా ఉందన్నారు. సొంత బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఇన్ని రోజులవుతున్నా దోషులను పట్టుకుని శిక్షించే పనిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేయలేకపోయారని విమర్శించారు. దోషులకు అండగా నిలిచే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పులివెందుల వెళ్లినా... కడప వెళ్లినా... అమరావతి వెళ్లినా... హైదరాబాద్ వెళ్లినా... ఢిల్లీ వెళ్లినా ఎక్కడికెళ్లినా వైఎస్.వివేకానందరెడ్డి హత్యలో ఆ కుటుంబ సభ్యుల పాత్రపైనే మీడియాలో ప్రధాన చర్చ నడుస్తోందన్నారు. ఒకవైపు రాష్ట్రం అప్పుల మయంగా మారిందని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర రుణభారం రూ.10 లక్షల కోట్లకు చేరనుందని తెలిపారు. నెల ఒకటవ తేది వచ్చిందంటే అప్పుల కోసం ఆర్థిక శాఖ మంత్రి చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అప్పుల భారం పెరిగినా అభివృద్ధి ఎక్కడా కనిపించదని విమర్శించారు. నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. దేశంలో సగటు నిరుద్యోగం 17 శాతముంటే రాష్ట్రంలో అది 35 శాతానికిపైగా ఉందని చెప్పారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబురావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదలపై పెద్దఎత్తున భారాలు వేస్తోందని విమర్శించారు. పెట్రోల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసిందన్నారు. బిజెపి అధికారంలోకి రాకముందు రూ.450 ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు రూ.1200లకుపైగా ఉందని గుర్తు చేశారు. పెట్రోల్ కూడా లీటరు రూ.45 నుంచి రూ.110లకుపైగా పెరిగిందన్నారు. ఇంకోవైపు ఆదానీ వంటి సంస్థలకు లాభాలు చేకూర్చడంలో భాగంగా విద్యుత్ ఛార్జీల భారాలు పడుతున్నాయని పేర్కొన్నారు. పేదల ఆదాయాలు ఒకవైపు పడిపోతుంటే కార్పొరేట్ సంస్థల ఆదాయం గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. ఒక్క ఆదానీ ఆదాయమే రూ.50 వేల కోట్ల నుంచి రూ.16 లక్షల కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. తెలుగు ప్రజలందరూ పోరాడి 32మంది ప్రాణాలు అర్పించి సాధించుకున్న విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేయాలని చూస్తోందన్నారు. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీయడంలో భాగంగా మతత్వాన్ని పెంచిపోషిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతున్నా ఇక్కడి అధికార వైసిపిగాని, అటు ప్రతిపక్ష టిడిపిగాని ఒక్క మాట బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. విభజన హామీల అమలుపై సైతం పెదవి విప్పడం లేదని దుయ్యబట్టారు. మైనార్టీలకు, వెనుకబడిన తరగతలకు అండగా ఉంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని ఇటీవల ప్రకటించిన అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీనిపై వైసిపి వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇక ఎన్నికల ముందు వరకు ధర్మపోరాట దీక్షలు చేస్తున్నామని చెప్పిన టిడిపి ఇప్పుడు బిజెపి రాష్ట్రానికి చేస్తున్న అన్యాయంపై మాత్రం మౌనదీక్ష చేస్తోందని ఎద్దేవా చేశారు. ఇక ప్రశ్నించడానికి వచ్చాను అన్న జనసేన నేత పవన్ కళ్యాణ్ బిజెపిని ప్రశ్నించలేకపోతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై, వారి తరుపున నిలబడి పోరాడేది వామపక్షాలు మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు, సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీశ్, సిపిఎం జిల్లా క్యాదర్శి వి.రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాలరంగయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యను కప్పేశారు..!

కూతలేరు వంతెన చుట్టూ ఫ్లెక్సీలు

నార్పల కూతలేరు వంతెన కన్పించకుండా చుట్టూ కట్టిన వైసిపి రంగుల ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-నార్పల

శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో దశాబ్దాల కాలంగా ఉన్న ప్రధాన సమస్య కూతలేరు వంతెన నిర్మాణం. ప్రభుత్వాలు మారుతున్నా దీని నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. బుధవారం నాడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నార్పల పర్యటనకు వస్తున్నారు. ముఖ్యమంత్రి వస్తున్న సమయంలో కూతలేరు వంతెన సమస్యను ఆయనకు చూపించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా ఏర్పాట్లు చేశారు. ఏకంగా కూతలేరు వంక చుట్టూ వైసిపి బ్యానర్లు, ఫ్లెక్సీలతో నింపేశారు. మొండిగోడలకు పరిమితమైన కూతలేరు వంతెన పరిస్థితిని చూసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తారని స్థానికులు భావించారు. ప్రజల ఆశలను అడియాశలు చేస్తూ ప్రజా ప్రతినిధులు వంతెన కన్పించకుండా ఫ్లెక్సీలతో కంపేశారు. వీరి తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వస్తున్న సమయంలో సమస్యను ఆయనకు తెలియజేసి, పనులు ప్రారంభించేందుకు నిధులు విడుదల చేయించాల్సింది పోయి ఇలా సమస్యనే కప్పేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

భారాలు మోపుతున్న ప్రభుత్వాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని పన్నుల భారాలు మోపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు తెలిపారు. మంగళవారం ఆయన అనంతపురం సిపిఎం 1వ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పలు వార్డుల్లో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో ప్రజలపై భారాలు పడుతున్నాయని తెలిపారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకులు ధరలు పెంచి ప్రజల నడ్డి విడుస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంటి, చెత్త పన్నులు, విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేసిందన్నారు. భారాలతో ప్రజల ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తోపుడు బండ్లు మీద వ్యాపారం చేసుకుంటున్న చిన్నచిన్న వ్యాపారస్తుల నుంచి మున్సిపాల్టీ రోజుకు రూ.పది నుంచి రూ.50 దాకా సుంకాన్ని వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ పన్నుల భారాలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా, ఇప్పటికీ మంచి నీటిని సరఫరా చేయలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉండడం సిగ్గుచేటన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మందికి రేషన్ కార్డులు లేవన్నారు. ప్రభుత్వం కట్టిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదన్నారు. ప్రజల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, కమిటీ సభ్యులు ప్రసాద్, ప్రకాష్, మసూద్, వెంకటేష్, బాబూ, మధ్య తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసరావు, శాఖా కార్యదర్శులు అంజి, మోహన్, ఫయాజ్, వలీ, పీరా పాల్గొన్నారు.



అనంతపురం నగరంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిహెచ్.బాబురావు

మోడల్ ఎంసెట్ సందర్భంగా మాట్లాడుతున్న పల్లె కృష్ణకిశోర్

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారతీయ విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో మోడల్ ఎంసెట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పివికెకె కళాశాల కరస్పాండెంట్ పల్లె కృష్ణకిశోర్, పల్లె శ్రీకాంత్ హాజరై పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లె కృష్ణ కిశోర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమా జంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నది టెక్నాలజీ మాత్రమే అన్నారు. ఈ టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఇంజినీరింగ్ విద్య దోహదపడుతుందన్నారు. సమాజంలో వేగవంతమైన మార్పులు, దేశ ప్రగతికి ఇంజినీరింగ్ విద్య చాలా అవసరమన్నారు. పివికెకె కళాశాల జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లే విధంగా నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యనందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు తరిమెల గిరి, రాచేపల్లి సూర్యప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, శివ, చంద్రకాంత్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జి.ఓబులు

9న 'శ్రీరామిరెడ్డి పథకం' కార్మికుల నిరవధిక సమ్మె

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లాలోని శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 9వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం తాగునీటి పథకం కార్మికుల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆ యూనియన్ అధ్యక్షుడు తిప్పేస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథి ఓబులు మాట్లాడుతూ తాగునీటి పథకం కార్మికుల సమస్యలపై మార్చి 23న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ సమక్షంలో చర్చలు జరపగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. చర్చల్లో పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యూటీ మూడు రోజుల్లో ఇస్తామని చెప్పి సమ్మెను విరమింపజేయించారని, అయితే ప్రభుత్వం, అధికారులు ఇంతవరకూ ఏ ఒక్క సయస్యను పరిష్కరించకపోవ డంనిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ఈ క్రమంలో మే 9వ తేదీ నిరవధిక సమ్మె చేపట్టేందుకు తీర్మానించారన్నారు. సమ్మె నేపథ్యంలో తాగునీటి సమస్య ఏర్పడితే జిల్లా అధికారులదే బాధ్యత అన్నారు. ఇకనైనా అధికారులు ఇచ్చిన హామీలను 9వ తేదీ లోపు నెరవేర్చాలన్నారు. సమావేశంలో తాగునీటి పథకం యూనియన్ నాయకులు శ్రీరాములు, రమేష్‌రెడ్డి, వశికేరప్ప, శ్రీనివాసులు, మహానంది, వన్నూరప్ప, శ్రీ సత్యసాయి జిల్లా యూనియన్ నాయకులు రవి, ఆచారి, లక్ష్మీనారాయణ, లక్ష్మిరెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆదిమూర్తి నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల 9వ బ్రాంచిలో ప్రీప్రైమరీ విద్యార్థులకు మంగళవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాలల అధినేత ఎజిఎం సుబ్బారెడ్డి హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు యాక్టివిటీస్ ద్వారా విద్యను నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా విద్యర్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, జోనల్ ప్రైమరీ అకాడమిక్ కో ఆర్డినేటర్ పూజ, అకడమిక్ డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌ఛార్జిలు చంద్రకళ, జ్యోతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై విచారించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ భూముల కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సిఎం జగన్ నేడు జిల్లాలోని నార్పల మండలానికి వస్తున్న సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూ ఆక్రమణలపై తెలియజేస్తూ సిఎంకు మంగళవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. పేదలకు సెంటు స్థలం ఇవ్వడానికి ప్రభుత్వానికి, అధికారులకు చేతులు రావడం లేదని, అదే భూకబ్జాదారులు వందలాది ఎకరాలు కబ్జా చేస్తుంటే అధికారులు చూస్తూ ఊరుకున్నారన్నారు. ముఖయంగా అనంతపురం రూరల్ మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 4-8ఎ, 4-7ఎ2, 4-7ఎ3, 4-7ఎపి, 4-ఎపి, 58-6లలోని ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకోవడంతోపాటు నకిలీ పత్రాలను సృష్టించి రూ.కోట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వాస్తవంగా సర్వే నెంబర్ 4-7ఎబి 0,40సెంట్లు, 4-8బి 0,60 సెంట్ల భూమిని జాతీయ రహదారికి చాలా సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే మాజీ సైనిక ఉద్యోగికి పట్టా ఇచ్చినట్లు అధికారులు చూపుతున్నారు. అయితే కొందరు ఈ భూములకు డి పట్టా పొందినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒకే భూమి జాతీయ రహదారికి, మాజీ సైనికునికి, పాములరాయికి చెందిన కొందరు వ్యక్తులకు ఎలా పట్టాలు పొందారో విచారించాలని డిమాండ్ చేశారు. నగరానికి సమీపంలో విలువైన ఈ భూమిపై కన్నేసిన కబ్జాదారులు కొందరు రెవెన్యూ అధికారులను లోబరుచుకుని నకిలీ పట్టాలు సృష్టించారని తెలిపారు. ఇదే మండలంలోని కొడిమి, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తెలిపారు. వీటిని నివారించి ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని కోరారు. అలాగే గార్లదిన్నె మండల కేంద్రంలో సర్వే నెంబర్ 456 1బీసీలో ఇనయతుల్లా పేరుతో 3.06 ఎకరాలు, 456-1బీ4లో రహీమ్‌బీ పేరుతో 3.04 ఎకరాలను 1980లో డిపట్టా ఇచ్చారన్నారు. 2008 వరకు వీరివురూ ఈ భూమిని సాగు చేశారని, 2008లో వీరి నుంచి ఈ మొత్తం భూమి 6.10 ఎకరాలరు కె.నాగరాజు అనే వ్యక్తి ఈ భూమిని కొనుగోలు చేసి తన కుమారుడు కె.జీవన్, కె.భానురేఖల పేరుతో పట్టాలు పొందారన్నారు. అప్పటి నుంచి 2022 వరకు వీరు ఆ భూమిలో చీనిచెట్లు పెట్టి ప్రభుత్వం నుంచి డిపార్ట్‌మెంట్ ద్వారా హార్టికల్చర్ షెడ్ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.4 లక్షల రుణం పొందారన్నారు. ఇందులో రూ. 2 లక్షలు సబ్సిడీ తీసుకున్నారన్నారు. వీరి నుంచి కొందరు రియల్ ఎస్టేట్ వారు ఈ భూమిని కొనుగోలు చేసి రెవెన్యూ అధికారులను లోబరుచుకుని 2008లోనే మాజీ సైనిక ఉద్యోగులకు పట్టా ఇచ్చినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారన్నారు. 2008లో పట్టా పొందినట్లు చూపుతున్న మాజీ సైనిక ఉద్యోగుల్లో ఒకరు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన గంటా మురళీకృష్ణారెడ్డి, మరొకరు ప్రకాశం జిల్లాకు చెందిన చిన్న వెంకటరెడ్డి, వీరు పట్టా పొంది ఉంటే కె.జీవన్, కె.భానరేఖ ఎలా సాగులో ఉన్నారని ప్రశ్నించారు. అలాగే జిల్లాలో కల్లూరు, బుక్కరాయసముద్రం, కూడేరు, శింగనమల, గుంతకల్లు, గుత్తి, పెద్దవడుగూరు, పామిడి తదితర మండలాల్లో కూడా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. వాటిని అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులతో సమగ్ర విచారించి భూములు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలో భూ పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

సిఎం జగన్‌కు సిపిఎం బహిరంగ లేఖ

బహిరంగ లేఖను విడుదల చేస్తున్న వి.రాంభూపాల్

నేరాలు ఘోరాలు

భార్యను చంపిన భర్త

మృతిచెందిన శిరీష

పెద్దపప్పూరు : భార్యపై అనుమానం ఉండడంతో భర్త హత్య చేసిన ఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలో రామాంజనేయరెడ్డి, భార్య శిరీషా (24) నివాసం ఉండేవారు. ఈనేపథ్యంలో భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈవిషయమై భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. ఇందులో భాగంగానే సోమవారం రాత్రి వాదులాడుకున్నారు. కోపోద్రిక్తుడైన రామాంజనేయరెడ్డి శిరీషా గొంతు నులిమి హత్య చేశాడు. వెంటనే మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో లొగిపోయినట్లు తెలుస్తోంది. శిరీషకు నాలుగేళ్ల కూతురు, రెండేళ్ల కొడుకు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గడ్డివాముల దగ్ధం

సుమారు రూ.15లక్షల నష్టం

కాలుతున్న గడ్డివాములు

పెద్దవడుగూరు : మండలంలోని చిన్నవడు గూరులో ఐదుగురు రైతులకు చెందిన పశుగ్రాసం విద్యుదాఘాతంతో మంగళ వారం పూర్తిగా దగ్ధమూంది. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన రైతులు సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, విజయభాస్కరరెడ్డి పశుగ్రాసాన్ని వాములుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈనేపథ్యంలో వాములపై వెళ్లిన విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి రాసుకుని నిప్పురవ్వలు చెలరేగాయి. ఆ నిప్పురవ్వలు గడ్డివాములపై పడటంతో మంటలు చెలరేగాయి. గమణించిన స్థానికులు ఆర్పేందుకు యత్నించారు. అయినా సాధ్యం కాకపోవడంతో గుంతకల్లు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి తెలిపారు. వారు వచ్చి ఆర్పేలోపు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. గతవారంలోనే గడ్డివాములను వేసుకున్నామని, అంతలోనే విద్యుదాఘాతంతో దగ్ధమయ్యాయని వాపోయారు. దీంతో రూ.15లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

సిఎం గారూ.. సమస్యలపై స్పందించండి..

జగన్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప బహిరంగ లేఖ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గారూ... శింగనమల నియోజకవర్గ సమస్యలపై స్పందించి పరిష్కరించండి సారూ.. అంటూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. సిఎం జగన్ జిల్లా పర్యటన సందర్భంగా నియోజకవర్గ సమస్యలను వివరిస్తూ ఓ.నల్లప్ప బహిరంగ లేఖ రాశారు. ముందుగా శింగనమల నియోజకవర్గంలోని నార్పల మండలానికి సిఎంకు స్వాగతం అంటూ లేఖలో మొదలు పెట్టి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని దాదాపు 35 అంశాలను వివరించారు. గత నెలలో కురిసిన వడగండ్ల వర్షానికి నార్పల మండలంలో వెంకటాంపల్లి, నాయనపల్లి, కేశేపల్లి తదితర గ్రామాల్లో అరటి, బత్తాయి, కళింగర, మొక్కజొన్న పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయన్నారు. పుట్లూరు మండల కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వం డిగ్రీ కళాశాలను ప్రారంభించాలని, అన్ని గురుకుల పాఠశాలల్లో కాస్మోటిక్ చార్జీలు, నోట్ పుస్తకాలు, ఇతర సదుపాయాలకు నిధులు పెంచాలని, హాస్టళ్ల, గురుకులాల మరమ్మతులకు నిధులు కేటాయించాలని, నియోజకవర్గ కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బైపిసి, ఎంపిసి గ్రూపులతోపాటు ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టాలని, బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో బాలికలకు ప్రత్యేక పాఠశాల, ఎపి మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, అన్ని మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే శింగనమలలోని సామాజిక వైద్యశాల, బుక్కరాయసముద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, అలాగే అన్ని మండల కేంద్రాల్లో ఉన్నప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 10 పడకలు, 24 గంటల ఆసుపత్రులుగా మార్చి తగిన సిబ్బందిని నియమించాలని, బుక్కరాయసముద్రంలో బి.ఆర్.అంబేద్కర్ కన్వెన్షన్ హాలుకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయాలని, మండల కేంద్రాల్లో అంబేద్కర్ భవనాలను నిర్మించాలని, బుక్కరాయసముద్రం తహశీల్దార్ కార్యాలయం ముందు ఉన్న మరవవంక, శింగనమల చెరువు కింద ఉన్న మరవవంక, నియోజకవర్గంలోని వివిధ చెరువు కింద ఉన్న మరవవంకలపై బ్రిడ్జిలను నిర్మించాలని, అలాగే గూగూడు కుళ్లాయిస్వామి, దేవరకొండ కొండమీదరాయుని రుషింగమయ్య కొండను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, నార్పల మండల కేంద్రంలోని కూతలేరు బ్రిడ్జిని పూర్తి చేయాలని, నార్పల మండల కేంద్రంలో చేనేత పార్కును ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు. అలాగే నార్పల, బుక్కరాయసముద్రం మండల కేంద్రాల్లో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నిర్మించాలని, పుట్లూరు మండలం సాలవేముల జాజికొండ వాగుకు చిన్నపాటి రిజర్వాయర్‌ను నిర్మించాలని, నియోజకవర్గంలో పళ్ల రసాల పరిశ్రమను ఏర్పాటు చేయాలని, పాడి పశువులకు బీమా సదుపాయం కల్పించాలని, లీటర్ పాలకు రూ.4 బోనస్ ఇవ్వాలని కోరారు. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురము గ్రామంలో వెటర్నరీ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో జింకల బెడద నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, పెనకచెర్ల డ్యాం నుంచి బైపాస్ కాలువ పనులు చేపట్టి శింగనమల మండలం సలకంచెరువు చెరువుకు నీరివ్వాలని, చాగల్లు రిజర్వాయర్ కింద ముంపుకు గురైన ఉలికల్లు, ఉలికుంటపల్లి గ్రామాలకు చెందిన ముంపు బాధితులను ఆదుకోవాలని, డోలమైట్, బ్లాక్ గ్రానైట్, వైట్ గ్రానైట్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శింగనమల మండలం రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ పార్కును పునరుద్ధరించాలని, సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, మట్టి, ఇసుక మాఫియాపై సమగ్ర విచారణ చేయించాలని, అర్హులందరికీ ఇంటి పట్టాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, మంచినీరు, వీధిదీపాల కరెంటు బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని, మండలాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికుల వేతన బకాయిలు చెల్లిఇంచాలని, రైతులందరికీ డ్రిప్పు, స్పింకర్లు వందశాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

జగనన్న పర్యటనను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-నార్పల

ముఖ్యమంత్రి జగన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపునిచ్చారు. ఈమేరకు మండల కేంద్రంలో సిఎం పర్యటన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా సభ వేదిక వద్ద విలేకరులతో మాట్లాడుతూ జగనన్న వసతి దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు జగనన్న నార్పలకు వస్తున్నట్లు తెలిపారు. కావున జగనన్న రాకను ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పి ఆహ్వానించాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలులో శింగనమల నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు. ఈవిషయాన్ని మనం జగనన్నకు చెప్పాలన్నారు. అందుకోసం నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామానికీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరికీ మజ్జిగ, స్నాక్స్, మంచి నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు సభా ప్రాంగణానికి వచ్చేలా జనం ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. జగనన్నే మన భవిష్యత్తు 'జగనన్నే మా నమ్మకం' అనే నినాదంతో సభ మార్మోగాలన్నారు. ఈ.కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపి తలారి రంగయ్య, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురాం, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల విస్తరణకు ప్రాధాన్యత

మేయర్ మొహమ్మద్ వసీం

అంతర్గత రహదారి పనులను పరిశీలిస్తున్న మేయర్ మొహమ్మద్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని అంతర్గత రహదారుల విస్తరణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ మొహమ్మద్ వసీం తెలిపారు. మంగళవారం నగరంలోని లక్ష్మీనగర్ నాగల కట్ట వద్ద రూ.1.20 కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సిఎం జగన్ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు, కల్వర్టుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. అంతేగాకుండా నగర చరిత్రలోనే తొలిసారిగా నగరాభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్ రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో చేసే పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తయిందని త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, ఖాజా, రఫీ, ఎఇ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పీవీకేకే ఐటీ విద్యార్థుల ప్రతిభ

బహుమతులు పొందిన విద్యార్థినులతో అధ్యాపకులు

అనంతపురం : పుట్టపర్తిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈనెల 21న నిర్వహించిన జాతీయస్థాయి సాంకేతిక సదస్సులో స్థానిక రుద్రంపేట పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పిబికెకె ఐటిలో ద్వితీయ సంవత్సరం ఇసిఇ విభాగం విద్యార్థులు శిరీషా, శాలిని, చంద్ర అత్యంత ప్రతిభ కనబరచి 5జి మొబైల్ టెక్నాలజీపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రథమ బహుమతి లభించినట్లు తెలిపారు. అలాగే బీటెక్ మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఇంజినీరింగ్ చదువుతున్న నందిని చౌహాన్, సాయి పూజిత, మనీషకు వ్యర్థ పదార్థాల తిరుప్రయోగం రీసైకిల్ అనే అంశంపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇసిఇ విభాగాధిపతి వెంకటేశ్వర్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.భార్గవి, హ్యుమానిటీస్ విభాగాధిపతి హర్షవర్ధన్, ఎఒ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తన కాయలివ్వాలి

పంట రుణాల మార్టిగేజ్ లేకుండా రూ.10 లక్షలు ఇవ్వాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌లో 90 శాతం సబ్సిడీతో ఎకరాకు 3 బస్తాల చొప్పున ఐదెకరాల వరకు విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో 14 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాగవుతోందన్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం సరఫరా చేస్తున్న విత్తనకాయలు కీలకంగా ఉంటున్నాయని తెలిపారు. గతేడాది పంట చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాల రావడంతో పంట కుళ్లిపోయిందన్నారు. కనీసం పెట్టుబడి కూడా తిరిగి రాలేదన్నారు. రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. దీనివల్ల గతేడాది 45 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. విత్తనాల కోసం రైతుల నుంచి రైతులు నేరుగా కొనుగోలు చేసుకునే అవకాశం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ సరఫరా చేసే విత్తనాలే పంటకు ప్రధానమవుతోందన్నారు.

ఖరీఫ్ ప్రారంభం అవుతున్న ఇప్పటి వరకు సబ్సిడీ ధర నిర్ణయించలేదన్నారు. ఎన్నికల ముందు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారని తెలిపారు. అధికారంలో వచ్చాక 40 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తుండటంపై రెండు సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నా వైసిపి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇచ్చి 90 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. కందులు, పెసలు, అలసందులు, ఆముదం, జొన్న, సజ్జ, కుసుమతో పాటు, ప్రత్యామ్నాయం విత్తనాలు ఇవ్వాలన్నారు. పంట రుణాలు రెన్యూవల్ జిల్లాలో ప్రారంభమైందన్నారు. బ్యాంకులలో రైతులు అసలు, వడ్డీ కట్టి రెన్యూవల్ చేసుకోవాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున గతంలో లాగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణం పెంచి, మాన్యువల్‌గా రెన్యువల్ చేసి, రూ.10 లోల వరకు మార్టిగేజ్ లేకుండా రుణాలు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించాలని కోరారు.

హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గంలో కూడేరు మీదుగా రాయదుర్గం-అనంతపురం మధ్య దాదాపు 52 గ్రామాల ప్రజల రవాణా సౌకార్యార్థం పిఎబిఆర్ బ్యాక్‌వాటర్ ప్రవాహంపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.53 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ రహదారి గుండా వాహనాలు వెళ్లలేని పరిస్థితి అన్నారు. పిఎబిఆర్ వెనుక జలాల కారణంగా దాదాపు 800 మీటర్ల మేర రహదారి నీటి ప్రవాహంలో మునిగిపోయిందన్నారు. దీంతో దాదాపు 52 గ్రామ ప్రజలకు రాయదుర్గం-అనంతపురం మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే దాదాపు 25 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ సోమర జయచంద్రనాయుడు, విడపనకల్ మాజీ ఎంపీపీ రమణారెడ్డి, ఉరవకొండ మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రమణాయాదవ్, వైసిపి నాయకులు తిప్పారెడ్డి, ఆకుకూర నాగరాజు, చంద్రమోహన్‌రెడ్డి, సూరి, కొనకొండ్ల లాలెప్ప, పాల్తూరు మహాలింగ, డోనేకల్ సురేష్, మాలాపురం కేశన్న, పందికుంట ఎర్రిస్వామి, చాబాల గురు, వజ్రకరూరు ఏసన్న, ఉండబండ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి

చిరుధాన్యాల సాగుకు ముందుకురావాలి

చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు : రైతులు చిరుధాన్యాల సాగుకు ముందుకు రావాలని పలువురు అధికారులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం- 2023లో భాగంగా జిల్లా వరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో చిరుధాన్యాల సాగులో మెళకువలు, అవగాహన, సాగు పద్ధతులపై రైతులు, రైతు భరోసా కేంద్రం సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎడిఎ డిఆర్‌సి శైలజాకుమారి మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాలు సాగు చేస్తే దిగుబడితోపాటు ధర కూడా ఉంటుందన్నారు. కావున రైతులు ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. డిఆర్‌సి ఎఒ శంకర్‌లాల్ మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్‌లో కొర్రలు, ఆరికలు, జొన్నలు, సజ్జలు వంటివి రైతులు సాగు చేయాలన్నారు. ఆయా పంటల్లో దిగుబడి తగ్గినా మరోక పంటలో లాభం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్, డిడిఎ మద్దిలేటి, ఎఇఒ సుజిత, రైతులు, రైతు భరోసా కేంద్రం సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO:121/2022.
Between:
ఎస్.లక్ష్మీదేవమ్మ ...వాది
మరియు
ఎస్.నసీమా పర్వీన్ ...ప్రతివాది
To
ఎస్.నసీమా పర్వీన్, భర్త:ఎస్.రసూల్, డోర్ నెం.6/1434-ఎ2, భాగ్యనగర్, గుంతకల్లు, అనంతపురం జిల్లా.
ప్రతివాదికి దావా సమను
పై దావాను వాది నీపైన ప్రాంసరి నోట్ల బాకీ రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసినాడు. పై దావా నీ యొక్క హాజరు కొరకు వాయిదా 11/05/2023 తేదిన వేయబడినది. కావున నీకేమైనా ఆక్షేపణలున్న యెడల పై తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు స్వతహాగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల దావా నీ పరోక్షమందు తీర్మానము చేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా 11/05/2023
మాదినేని రవిశంకర్
వాదితరుపు వకీలు, గుంతకల్లు

మహారాజశ్రీ గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO:204/2022 in O.S.NO:121/2022.
Between:
ఎస్.లక్ష్మీదేవమ్మ ...వాది
మరియు
ఎస్.నసీమా పర్వీన్ ...ప్రతివాది
To
ఎస్.నసీమా పర్వీన్, భర్త:ఎస్.రసూల్, డోర్ నెం.6/1434-ఎ2, భాగ్యనగర్, గుంతకల్లు, అనంతపురం జిల్లా.
ప్రతివాదికి నోటీసు
పై అర్జీను వాది నీ యొక్క ఆస్తిని తీర్పుకు ముందు జప్తుకు గాను దాఖలు చేసినాడు. పై అర్జీ నీ యొక్క హాజరు కొరకు వాయిదా 11/05/2023 తేదిన వేయబడినది. కావున నీకేమైనా ఆక్షేపణలున్న యెడల పై తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు స్వతహాగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల దావా నీ పరోక్షమందు తీర్మానము చేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా 11/05/2023
మాదినేని రవిశంకర్
వాదితరుపు వకీలు, గుంతకల్లు

'ఉపాధి' కూలీలకు మౌలిక వసతులు కల్పించండి

వ్యకాసం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం వజ్రకరూరు మండల పరిధిలోని కడమలకుంట గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం ఒక వరం లాంటిదన్నారు. ఈ చట్టాన్ని నమ్ముకుని సుమారు నాలుగు లక్షల మందికిపైగా జీవనం సాగిస్తున్నారన్నారు. ఇలాంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కేంద్రం పూనుకోవడం బాధాకరమన్నారు. చట్టంలో కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చి సమ్మర్ అలవెన్స్, అదనపు వేతనాలను రద్దు చేసిందన్నారు. ఎండలు విపరీతంగా ఉండడంతో ఉపాధి కూలీలు పనులు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పనులు చేసే ప్రదేశంలో వెంటనే షామియానాలు ఏర్పాటు చేయడంతోపాటు మెడికల్ కిట్, ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. త్వరగా బిల్లులు అందేలా చర్యలు చేపట్టారని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు రెన్యువల్ చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతుల నుంచి అసలూ, వడ్డీ కట్టించుకోకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతు పంట రుణాలను రెన్యువల్ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది జిల్లాలో ఎక్కువగా కురిసిన వర్షాలతోపాటు అకాల వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చాలామంది రైతులు పంటలు సాగు చేసేందుకు బయటి వ్యక్తుల నుంచి కూడా వడ్డీలకు డబ్బులు తెచ్చి పెట్టుబడులు పెట్టారన్నారు. ఈనేపథ్యంలో పెట్టిన పెట్టుబడులు సైతం రాలేదన్నారు. కావున బ్యాంకుల్లో అసలు, వడ్డీ కట్టించుకోకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు పెంచి ఎకరాకు రూ.45 వేలు చేసి రెన్యువల్ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ స్కేల్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు పెంచి రెన్యువల్ చేయాలని, మర్డర్ కేసు లేకుండా రూ.10 లక్షల రుణం ఇవ్వాలని కోరారు. అలాగే బ్యాంకు వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి రాము, ఆవాజ్ నాయకులు వలి, సిఐటియు మండల కార్యదర్శి జయమ్మ, ఐద్వా నాయకురాళ్లు సరస్వతమ్మ, వెంకటమ్మ, రైతులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు

కుట్టు శిక్షణపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి-బొమ్మనహాళ్

మండల పరిధిలోని శ్రీధరఘట్ట గ్రామంలో మంగళవారం ఐకెపి సహకారంతో గ్రామ సర్పంచ్ యోగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపి ఎపిఎం సురేఖ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతులు కుట్టు శిక్షణ నేర్చుకుంటే ఉపాధితో పాటు ఆర్థికంగా బలోపేతమవుతారన్నారు. విద్యావంతులు కానీ చదువురాని వారు కానీ ఒంటరి మహిళలు నేర్చుకుని జీవనోపాధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మలేరియా నివారణ దినోత్సవంలో వక్తలు

ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు తప్పనిసరిగా దోమతెరలు వాడి మలేరియా నుంచి రక్షణ పొందాలని వైద్యులు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ ఎనాఫిలస్ అనే దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలను పాటించాలన్నారు. విపరీతమైన చలి, విడిచి విడిచి జ్వరం రావడం, వాంతులు, తలనొప్పి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష చేయించుకోవాలన్నారు. ఒకవేళ మలేరియా వ్యాధి అని నిర్ధారణ అయితే 14 రోజులపాటు చికిత్స తీసుకోవాలన్నారు. 15వ రోజు తిరిగి పరీక్ష చేయించుకుని మలేరియా తగ్గిందో..లేదో చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా, సీహెచ్ఓ చంద్రావతి, ఎంపీహెచ్ ఈఓ నాగేశ్వరయ్య, మునాఫ్, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఒపి.సిబ్బంది, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా 12 సచివాలయాల పరిధిలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన సదస్సులో డాక్టర్లు ఎ.కళ్యాణకుమార్, ఎస్.ఉషారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ అధికారి భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు చిన్న కంబయ్య, లక్ష్మీకుమారి, నాగరత్నాలు, హెల్త్‌అసిస్టెంట్ సుధాకర్, శరత్, ల్యాబ్ టెక్నీషియన్ శివరాజ్, హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుత్తి మలేరియా అధికారి రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీనివాస్‌బాబు, అమర్నాథ్ మాట్లాడుతూ దోమతెరలు వాడడం ద్వారా మలేరియా రాకుండా నివారించవచ్చన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అన్నారు. దోమల నివారణకు సహకరిస్తే మలేరియాను పూర్తిగా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఎఎన్ఎంఎస్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ : మలేరియా రహిత సమాజ స్థాపన ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని రాకెట్ల, విడపనకల్, పాల్తూరు, గడేకల్ గ్రామాల్లో వైద్య, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మంచినీటిలో పెరిగే ఆడ అనాఫిలస్ దోమకాటు వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. మలేరియా లక్షణాలు చలితో కూడిన జ్వరం వచ్చి కొంత సేపటికి చమటలు పట్టి జ్వరం వదులుతుందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీగా బయలుదేరి రంపపు కోత కొట్టాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అరుణకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మానాయక్, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, ఉమాశంకర్, మాధవరెడ్డి, పంచాయతీ సెక్రటరీ సోమయ్య, శిల్ప, సిహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్లు శర్వాస్‌వలి, జాఫర్, మధు, అరుణ, ఈశ్వర్, భగవాన్‌దాస్, సచివాలయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బూత్ ఇన్‌ఛార్జీల శిక్షణకు తరలిన టిడిపి నాయకులు

పుట్లూరు : అనంతపురంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు, గ్రామ/వార్డు బూత్ ఇన్‌ఛార్జీల శిక్షణకు మంగళవారం మండలం నుంచి టిడిపి నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాలరంగయ్య, శివశంకర్ రెడ్డి, రవిచంద్ర నాయుడు, ఆదినారాయణరెడ్డి, లక్ష్మయ్య, భక్తవత్సల, నవీన్, రామాంజినేయులు, రామానాయుడు, చంద్ర, రామాంజి, తదితరులు ఉన్నారు.

ఎంజెపి ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల ప్రభంజనం

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపొలమ సమీపంలో ఉన్న మౌర్య పాఠశాల విద్యార్థులు జ్యోతిరావు పూలే ప్రవేశ పరీక్షల ఫలితాల్లో ప్రభంజనం సృష్టించినట్లు అధినేత బోయ ఆంజనేయులు తెలిపారు. ఈనెల 16వ తేదీన జరిగిన పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇందుకు తమపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు టీచర్లకు అంతర్ జిల్లా బదిలీలు

అనంతపురంసిటీ : కోర్టు ఉత్తర్వుల మేరకు కర్నూలు జిల్లాలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.లలితను అనంతపురం రూరల్ మండలం పాపంపేట జెడ్పిహెచ్ఎస్‌కు, అలాగే గుడిబండ మండలం జంబులబండ జెడ్పిహెచ్ఎస్‌లో బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.రామకృష్ణను పుట్టపర్తి మండలం ఎనుములపల్లి జెడ్పిహెచ్ఎస్ కు బదిలీ చేస్తూ డిఇఒ సాయిరామ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సోములదొడ్డి వద్ద ఐఎంఎల్ డిపో గోదామును నిర్మించాలి

అనంతపురం : స్థానిక సోములదొడ్డి సమీపంలో ఐఎంఎల్ డిపోను తిరిగి నిర్మించాలని హమాలీ వర్కర్స్ యూనియన్ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో సౌకర్యవంతంగా ఉన్న ఐఎంఎల్ డిపో గతంలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన విషయం తెలిసిందే అన్నారు. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోకపోవడంతో కొంతమంది నాయకులు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తక్షణం గోడౌన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు తిరుపాల్, దేవదాసు, అంజనేయులు, నాగార్జునరెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో లేగదూడల ప్రదర్శన

బెళుగుప్ప : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో ఎంపిటిసి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా లింగ నిర్ధారిత వీర్యం, ముర్రుపాలు, ఖనిజ లవణాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపసంచాలకులు డాక్టర్ టివి.సుధాకర్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం వాడటం వల్ల 90 శాతం ఆడ దూడలు పుడతాయన్నారు. కేవలం 10 శాతం మాత్రమే మగ దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ఒక పశువుకు రెండు ఇంజక్షన్లు వేస్తే రైతు వాటా రూ.500 అవుతుందన్నారు. ఒకవేళ పశువు గర్భం దాల్చకుంటే రూ.500 వాపస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మగ దూడ పుడితే రూ.250 తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లేగదూడలకు బహుమతులు ప్రదానం చేశారు.

లేగదూడలను ప్రదర్శిస్తున్న రైతులు

గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

నార్పల : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలను ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థినులతో పాఠశాలలో సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం పాఠశాలలోని కిచెన్ గార్డెన్, వంటశాల, స్టోర్‌రూము, మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ, తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి, బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బుకొఠారి, తదితరులు పాల్గొన్నారు.

భద్రావతీ భావనారాయణస్వామి కళ్యాణం

యాడికి : మహోత్తమ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భద్రావతీ భావనారాయణస్వామి కళ్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కళ్యాణాన్ని తిలకించారు. రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

గుత్తి : పామిడి మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతాంగ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న చంద్రానాయక్

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-గుత్తి

దళితులకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ తప్పనిసరి అని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సామ్రాట్ మధు, జిల్లా నాయకురాలు కె.సునీత డిమాండ్ చేశారు. దళిత సమస్యలు తెలుసుకోవడంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు 23ఎస్సీ కాలనీని సందర్శించారు. ఇందులో భాగంగా దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో గో టు విలేజ్ 50 డేస్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎబిసిడి వర్గీకరణ జరిగితేనే మాదిగలకు న్యాయం అన్నారు. అలాంటి వర్గీకరణ పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మహిళా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు, జయన్న, బేతాపల్లి రమేష్, భారతి,పద్మావతి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

బొమ్మనహాల్ : ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామానికి చెందిన హమాలీలు తహసీల్దార్ శ్రీనివాసులుకు విన్నవించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ తాము 20 ఏళ్లుగా ఉద్దేహాళ్ గ్రామంలో నివాసం ఉంటున్నామని 2016లో ఇద్దరికి ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. మిగిలిన 34 మంది ప్రభుత్వం మంజూరు చేసిన లేఔట్‌లో పునాదులు వేసినా ఇంతవరకూ ఇళ్ల పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని హమాలీలు పెన్నయ్య, వన్నూరుస్వామి, రాముడు, తదితరులు కోరారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి అప్పాజీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

జీన్స్ తయారీలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతులు ఉన్నచోటే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి శ్రీరంగం అప్పాజీ సూచించారు. రాయదుర్గం మండల పరిధిలోని 74-ఉడేగోళం టెక్స్‌టైల్ పార్కులో జీన్స్ ప్యాంట్ల ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో నూతన డిజైన్లకు ప్రాధాన్యమిచ్చి దుస్తులను తయారు చేసినందుకు వారి నైపుణ్యాన్ని అభినందించారు. గ్రామీణ యువతులు అంకితభావంతో పనిచేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కెటిఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌లోనే ఉన్న గార్మెంట్స్ యూనిట్ల నిర్వాహకులు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి టెక్స్‌టైల్ పార్కుకు వచ్చి వెళ్లేందుకు వాహన సదుపాయం, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తుండడంతో స్థానికంగానే ఉపాధి లభించినట్లు అవుతుందన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని సామాజిక మాధ్యమాల ద్వారా నైపుణ్యం పెంచుకోవాలని, తద్వారా యువతులు స్వతహాగా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్నారు. తద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి అధికారి బసవరాజు, పారిశ్రామికవేత్తలు పద్మావతి ప్రసాద్, ఇబ్రహీం, ఖలీలుల్లా, చమ్మా ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.